కథానిక

# చింతలతోపులో చీకటి

"రమణశ్రీ"

"ఆడియ్యాలగూడా తాగమొయ్యినట్టు న్నోడు" అంది అప్పలమ్మ.

నులకమంచంమీద ముసలయ్య కొయ్యిఁకొయ్యిఁమని తెరిపిలేకండా దగ్గిపోస్తున్నాడు. గుడ్డి దీపం కిరసనాయిలు పీలుస్తూ గాలికి రెపరెపలాడుతోంది. "ఆడిబతుకే అంత!" అన్నాడు దగ్గు తెరిపిచేసుకుంటూ, "తాగుమోతెదవ... కూలీ నాలీ చేసి తెచ్చింది కాస్తా కల్లుపాకలో సెయ్యిగడుగ్గుంటున్నోడు."

"పూలీసోళ్ళు తాగినోళ్ళనట్టుకుంటారు గందా, ఈణ్ణెప్పడూ ఆట్టుకోలేదేం?"

"ఏడిసేరు యెదవనాయాళ్లు... ఆల్లూ తాగడాని కొత్తంటే ఇంకేటిసేయం? ఇంకేటి గవరన్నమెంటోడు."

"ఊడుపులుగందా ఆడు తిరంగా పనిలోకెత్తే నిచ్చేపంనాగ రూపాయి పాపాయొత్తంటే తినొచ్చు తిరగొచ్చు... తెచ్చింది తేంచి తాగేస్తే ఏటిసెప్పు..."

ముసలయ్యకి కొడుకుమీద నిర్ధారణమైన అభిప్రాయం కొసలు తేరడంలేదు. తాగి తందనాలు తొక్కుతూ ఇంటికొచ్చి, పెళ్ళాన్ని బాది డబ్బులు గుంజుకుపోయి హైరానుపెట్టే తన కొడుకుంటే నీచమైన గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. ఆ బాధ అప్పలమ్మ మాంగళ్యంమీద ముద్రవేస్తుంది. అప్పలమ్మ జాగ్రత్తపడుతూ, "అత్తమానూ మనసు కట్ట మెట్టుకోకు! అణ్ణి గురించి యిసారపడితే తెగులు తెల్లారిద్ది" అని కేక వేసింది.

చూరులొంచి సన్నని వెన్నెలచారె గుడిసెలో దిగి, ముసలయ్య పక్కమీద ముగ్గు పెడుతోంది. కుండల్లో మెతుకులకోసం ఎలకలు చప్పుడు చేస్తున్నయ్.

"ఏటా సప్పుడు? అచ్చేడి?"

"ఏంనేదూ ... ఎలకానుంచూ ... ఊడిసేసిన కుండల్లో గెలుకుతున్నయ్."

"మనలాటోళ్ళ యిల్లల్లో ఏటుంటయ్ అని యీడబడేడుత్తాయ్... అచ్చెక్కడికెళ్ళిందే?"

"ఏడకెళ్ళిందో ఈడమటుకు రానా... దానికీ పెత్తనాలెక్కిపోనాయి. ఆ యెలకలూ నుంచులూ మనలాటి బీదయ్యే గామోసు ఈడబడేడుత్తాయ్." గడదగ్గర చప్పుడైంది. ఓరగాఉన్న తడికె తప్పించుకొని అచ్చి లోపలికొచ్చింది.

"ఏడకెళ్ళినావే పిల్లా! అద్దరేతిరిదాకా నీకు పెత్తనాలేటి?"

"ఏంనేదు! ఆ రంగమ్మ తోటీ ఆ వూసూ... ఈ వూసూ."

"ఆ రంగసాని తోటా...అదో రంకుసాని... దాంతో జత గూడు...నీ మొగుడేమో తాగుమోతు నువ్వు తిరుగుమోతు."

తనను సాధించడానికి కొడుకుని వెనకా ముందూ వేసుకొని ఎన్ని మాటలైనా అంటుంది. నిలువునా దహించి వేయడానికి ఒక్కమాట చాలు. మొగుడు తాగుబోతయినంత మాత్రంతో తను తిరుగుభోతై పోయి, నలుగురి నోళ్ళల్లో నాని పోతుందా? తన బండబతుకీడ్వడానికి దున్నపోతులుకూడా చాలవు. ఆ మూర్ఖుడి మూలంగా ఒక క్షణం సుఖం లేకపోతే వేరే అన్వేషణలో కోరిన కోరికలు తీర్చుకోడానికి అభ్యంతరం వుందా? అప్పుడు తను రంగు మార్చుకొని, మరొక మూర్తిని చేపడుతుంది. మారుమనువు. తన కెక్కడ సుఖంలేకపోతే అక్కడే విడాకులు.

తనూ అందరితోపాటు కూలికెళ్ళి అంతో యింతో తెచ్చి పడేస్తోంది. ఐనా అత్త మెచ్చక పోవడం పుట్టుక ముందరి పగలు తీర్చుకో సాధించుకోవడానికి గాబోలు.

"ఇదొరకంత తాగేవాడు గాలమ్మా! మొదటి పెళ్లాం మోసంజేసి యెల్లిపోంగానే, తాగుళ్ళో కడిపోనాడు" అంటుంది అప్పలమ్మ. ఆ మాటే నిజమేమో!

వెన్నెల వెలవెల బోతూవుంది. చుట్టూ తాడి చెట్లూ ఈతచెట్లూ దడిగట్టేసి నట్టున్నయ్. పాకలో మనుషులు నోటికొచ్చిన కూతలు కూస్తున్నారు. ఆ వాతావరణానికి అలవాటు పడ్డవాడుతప్ప పైవాళ్ళకి ఆ వాసన పీల్చడం చేతగాదు.

అచ్చి తాడిచెట్లవరసలోకి దిగింది. ఆ బాటలన్నీ అలవాటే! సన్నగా చారల పాములా మెలికలు తిరిగి పోతున్న కాలిదారి వెంట నడుస్తోంది. ఎవరో బూతులు తిట్టుకొంటూ వస్తున్నాడు. చటుక్కున పొదచాటుకి తప్పుకొంది. వచ్చేవాడెవరైందీ అచ్చి ఇట్టే పసిగట్టింది. మైకంలో అతను పేలుతోన్న పేలుడు తనచెవుల్లో పేలిపోతోంది. మనసులు తిడుతోన్నది ఎవర్నో? తెల్లవారేసరికి కాటిలో కాలిపోయే ఆ నిర్భాగ్యుడెవరో? అచ్చమ్మకేం పాలుపోలేదు. పొదచాటునుంచి బాటమీద పడింది.

గురివెంద తీగెల పక్కనేవున్న పాకదగ్గరికి వచ్చేసరికి రేగుతోన్న వాగుడు ధూళి పలచబడి నట్టుంది. వెన్నెలసన్నగా చారలు చారలుగా పాకకి వాతలు పెడుతోంది. రైంయ్యిమని గాలి ఈతాకు సందుల్లోంచి ఈలవేస్తోంది. తాటిచెట్లు తాగినవాళ్ళకి మల్లే ఊగుతున్నాయి. సారా నారయ్య డబ్బులు లెక్కపెట్టు కొంటున్నాడు గుడ్డిదీపం ముందు. అచ్చి పిచ్చి దానిలా వెళ్ళి నిలబడింది. నారయ్య బుర్రెత్తకండా అలికిడికి బేరమేమో అనుకొని, 'ముంతోయ్యనా?' అనేశాడు.

"నేనూ నారయ్యమావా! అచ్చిని" అంది.

నారయ్య ముక్కుమీద వేలేసుకుని, "కొంప ముంచేవు గందే! నువ్వొరాడం ఎవురూ సూడనేదు గందా!" అని బేజారెత్తి పోయాడు.

"ఆడేడీ?"

"మీ మొగోడా? పుల్లుగా తాగుండాడు. దగ్గిరికెళ్లావా తాడు తెంపుతాడు."

"మునవబెవర్నేటి తిట్టుకుంటూ పోతండాడు?"

"ఆడో పిచ్చినాయాల ఏటి నువ్వొచ్చిన పని సెప్పే సిలకా."

అచ్చి చిక్కువిడిపోయేట్టు నవ్వింది.

నారయ్య డబ్బులు సంచి గలగల లాడుతోంది.

"ఏమాత్రం వొచ్చిందేటి మావా!"

"మనకి నోటేటే? తాగేవోళ్ళు సల్లగుండాలి గాని. ఎవరూ సూడకండా సేసేదిగనక డబ్బుకి నాలుగు డబ్బులు రాల్తాయి. నీరా పేరుసెప్పటం సారా అమ్మేటం. ఇదివరకటికంటా ఇప్పుడే బాగుంది దేవుడిపున్నెమా అని."

"మావాఁ! సీకట్లో వొంటిగాయెల్లేను! అడదాకా దిగబెట్టుమావాఁ!" అంటూ అచ్చి గునిసింది. నారయ్య అభిప్రాయం కొసలందుకొని కేరింతాలు కొడుతూ ముందుకు సాగాడు అచ్చి చెంగుపట్టుకుని ఛంగున దూకుతూ.

"నువ్ రాటం ఏరేనా సూశారేమిటి?" అనడిగాడు నారయ్య.

"ఏరూ సూడనేదు. ఏంటలాగడిగావేం?"

"సూస్తే సిక్కుగాదేటే! నీ యత్తతో సెపితే అత్త సితకబొడవదూ!"

అచ్చికి గుండె దడపట్టుకుంది. వెలగచెట్టు దగ్గఱ నీడ వెనక్కి జరిగినట్టు కనిపించింది. కళ్ళ చుట్టూ చీకటితెరలు వేస్తున్నాయి.

"మావాఁ భయమేత్తంది...సెట్టుదగ్గిర నీడ పాకినట్టానిది ఏదేనా దాగిగాసి..."

"పిచ్చిమొగమా? ఏరే దారిగానేది! సింతల తోపు దాటాక బాటంబడిపోతే కొంపరాదటే! ఈ రేత్తిరి కాడింకేడ కెల్తావ్! మాయింటికాడడు కొని పోదుగాని, పొద్దుబొడిసే తలికి."

అచ్చికా మాటలు నచ్చినట్టున్నాయి. సరే అని తలూపింది. ఊపిందో లేదో, ఒక్కఊపున చాటునుండి, నారయ్య బుర్ర చెక్కలైంది. విరిగిన మానులా ఒరిగిపోయాడు. అచ్చి, చింతలతోపంతా అదిరి పోయేట్టు కేకవేసింది. వెనకనించి యిద్దరు యమదూతల్లాంటి మనుషులొచ్చి ఒకడు నారయ్యని, ఒకడు అచ్చిని లాక్కుపోయారు. నారయ్య తలనించి కారే రక్తం వెన్నెలను ఎరుపెక్కిస్తోంది. విధి విచిత్రంగా నవ్వడంకంటె ఈ సమయంలో ఏంచేస్తుందో ఎవరికీ అర్థంకాదు.

* * *

అచ్చి గజదొంగల ఉక్కుచేతుల్లోంచి బయట పడేటప్పటికి తెల్లవారింది. నారయ్య సంగతేమిటో తన కంతుచిక్కలేదు. బుర్ర పగిలి చచ్చిపోయేవుంటాడు. పొద్దుపొడిచిందో లేదో, గూడెమంతా పుకారు పొగరేగింది చింతలతోపులో

నారయ్యనెవరో నరికేశారని... అందులో తన పేరుకూడా వినిపిస్తదేమో అని అచ్చి గుండె పిట పిట లాడింది.

నారయ్య శవం చింతలతోపులో పొదల చాటున దిక్కూ మొక్కూ లేకుండా పడివుందట. పశువులకాపరి కుర్రాళ్ళు శవాన్ని చూచి బెంబే లెత్తిపోయి మునసబు కరణాలకు మొరపెట్టారు.

తలమీద బలమైన గాయం, కాయంనిండా కంగారుగా కారిన రక్తం; అడ్డదిడ్డంగా పడ్డ దేహం; చూచేవాళ్ళ చూపుల్ని భయావహంచేస్తున్నయ్!

ఈ చావు బరువంతా ఎవరినెత్తిమీద పడబో తుందో, ప్రజలు ఊహించసాగారు. పగవాళ్ళందర్నీ వెనక్కి తీశారు. అచ్చికీ నారయ్యకీ ఏదైనా అను బంధంఉందనిగాని అచ్చి మొగుడు చంపేశాడేమో!

వెట్టివాళ్ళని తీసుకెళ్ళి శవాన్ని పంచాయతీ జరిపి పంచభూతాలకి అప్పజెప్పేశారు. మునసబు పోలీస్ సర్కిలినస్పెక్టరుకి రిపోర్టు రాసి పంపిం చాడు దర్యాప్తుకోసం రమ్మని.

ఆ రోజునుంచి అచ్చి మొగుడు ఊళ్ళోనే లేకండా ఉండడం చాలామంది అనుమానానికి బలం చేసింది.

పోలీస్ సబినస్పెక్టరు వచ్చి దర్యాప్తుకోసం అనుమానం ఉన్నవాళ్ళందర్నీ చెప్పమంటే అచ్చి మొగుడి పేరే ముందుకొచ్చింది.

ఇనస్పెక్టరుకి మంచి అవకాశం చిక్కింది. అచ్చి ఇంటికెళ్ళి అప్పలమ్మ మొసలతను గోలపెడు తున్నా అచ్చిని తిన్నగా స్టేషన్‌కి తీసుకెళ్ళి పోయాడు. అచ్చి గోలెత్తిపోయింది ఇదేమిటిలా తనమీద ఈనేరం విరుచుకుపడిపోతోందని.

ముందుకుముందే కచేరీలో ఏడుపు లంకించు కొంది అచ్చి తనకేం తెలీదు బాబో అని.

అంతమాత్రంతో పోనిచ్చేట్టయితే బావుణ్ణు. సూదిబెజ్జంలోంచి, ఈ నేరం తాలూకు పలుపు దూరాలి. అప్పుడెంతమంది ఇందులో జొరబడాలో ఆ తాడే లాగుతుంది. ఇప్పుడు దొరికిన అచ్చి తోనే నేరం చుట్టబెట్టుకుందని ఇనస్పెక్టరు కర్థమై పోయింది. అక్షరం పొల్లుపోకుండా ఉన్నదున్నట్టు ఆ రాత్రి యేం జరిగిందీ ఖచ్చితంగా చెప్పేసింది. నారయ్యదీ తనదీ ఎలాంటి సంబంధమో, నారయ్య వృత్తిరహస్య మేమిటో మునసబుకీ అతనికీ ఉండే తగాదా లేమిటో లాఠీ పైకెత్తేసరికి గడగడ వణికి పోతూ చెప్పేసింది.

"నీ మొగుడే చంపేడని అంతా అంటున్నారు దానికేమంటావ్? ఆ రాత్రి వాళ్ళ మొహాలు గుర్తుపట్టగలవా?" అనడిగాడు సబ్బినస్పెక్టరు.

"తల సుట్టేసుకొని, ముఖాలికి రంగేసుకొన్నారు బాబూ! నే నేటి గుర్తుపట్టను, నడిసీకటి" అంది దుఃఖం దిగమింగుతూ.

కావలసిన ప్రశ్న లన్నింటికీ సమాధానం లాగి పుచ్చుకొన్నాడు.

"ఇంక నాతో యేటి పని బాబూ! గూడానికెల్లి పోనా" అంది అచ్చి. ఇనస్పెక్టరు వికటంగానవ్వాడు.

"నీతోనే వుంది చావూ బతుకూ... నీ మొగుణ్ణి పట్టుకోడానికి పోలీసులు తిరుగుతున్నారేవి టను కొన్నావ్? ఇద్దర్నీ దగ్గరపెట్టి అప్పుడు దారికి తీసుకురావాలి కేసు."

"నాకు తిండీ తిప్పలూ."

"జైల్లోనే—"

అచ్చి గుండెల్లో బండరాళ్లు దిగాయి. ఒక్కొ క్కప్పుడు బతుకెంత వంకరలిరిగిపోతుందో?

• • •

మసక నిద్రలో ఏవో మూలుగు విని పించి అచ్చి వేచిచూసేసరికి తన మొగుడు పక్కనే పడి వున్నాడు. స్పృహలేదు. చావుబతుకుల్లో ఉన్నా డేమో? వంటినిండా కట్లపాముకి మల్లే కట్లు!

మెల్లిగా దగ్గరికి చేరింది. కాలుతోన్న ఆర చేతుల్తో ముఖాన్ని నిమిరింది. ఉచ్ఛ్వాస నిశ్వా సాలు గాడుపుల్లా వున్నయ్. ముఖంలో చచ్చి పోయిన కళ, అతని ఊపిరిని అంటిపెట్టుకుంది.

అంత నీరసంలోనూ మెల్లిగా రెప్పలు బరు వెత్తుతూ ఎత్తాడు. అచ్చి ముఖంలోకి అదోలా వెఱ్ఱిచూపు చూశాడు. అలా చూడ్డం అతనికి మొదటిసారయినా, చివరిసారి కూడా నేమో!

"నారయ్యని సంపింది నేనే! ఆడు నీతో కులుకు తూంటే సూడనేక సంపడానికి తయారయ్యాను. నేను పొద్దోయేతలికి, ఎలాగేనా సచ్చిపోతాను. నివ్వేనా సుఖంగుండు, చలాకయిన ఇంకో మనువు సేసుకుని..."

ఇక మాట్లాడలేక పోయాడు. అచ్చి బతుకును తెల్లవారుస్తూ తెల్లవారింది.

★